క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ భగవద్గీత చదవాలి



కొత్తకోట రూరల్: సృష్టిలో ప్రథమ గ్రంథం భగవద్గీత అని, అందుకే ప్రతి ఒక్కరూ చదవాలని త్రైత సిద్ధాంత, ఇందు ప్రభోద సేవా సమితి జ్ఞాన వేదిక కొత్తకోట, పెబ్బేరు కమిటీ అధ్యక్షులు విజయభాస్కర్ అన్నారు. ఆ దివారం మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాలను ప్రచారం చేశారు. శివరాత్రి పండుగ విశిష్టతను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, తిరుమలేష్, భాస్కర్‌రెడ్డి, ముజఫర్‌ఖాన్, శైలజ, జ్యోతి, శంకరమ్మ, ప్రమీల, మంజుల, లయ ఉన్నారు.

సంఘం బలోపేతానికి కృషిచేద్దాం



పాన్‌గల్: మాదిగ ఉద్యోగుల జాగృతి సంఘం బలోపేతానికి అందరం కృషి చేద్దామని మాదిగ ఉద్యోగుల జాగృతి సంఘం జిల్లా కన్వీనర్ ఆది వెంకట్, సంఘం సభ్యులు మురళీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘానికి ప్రాణం పోసి నిలబెట్టి రాబోయే తరాలకు అందించడానికి మాదిగ పెద్దలు, మాదిగ ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగులు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో గోవింద్, అజయ్, శివరాజ్, జానీ, లక్ష్మణ్, రామకృష్ణ, రాములు, భాస్కర్, గురువేదం, వెంకటేష్, రామకృష్ణ, ఆంజనేయులు, అభిమాన్యుడు పాల్గొన్నారు.

మాదిరి పరీక్ష విజయవంతం

ఆత్మకూర్: నవోదయ గురుకులంలో పేద విద్యార్థులకు అవకాశం కల్పించేందుకు ఆదివారం నిర్వహించిన ఉచిత మాదిరి పరీక్ష విజయవంతమైందని నిర్వాహకులు మీర్జా అన్వర్‌బేగ్, మీర్జా అక్తర్‌బేగ్‌లు తెలిపారు. స్థానిక వికాస్ కళాశాలలో నిర్వహించిన మాదిరి పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఐదో తరగతిలో ప్రవేశ పరీక్షలు జరుగుతున్నాయని విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఉచిత మాదిరి పరీక్షను నిర్వహించామన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత ఆలయ వార్షికోత్సవం



మద్దూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు రాఘవేంద్రాచారి, మధుసూదనాచారి మంత్రోచ్ఛారణల మధ్య ధ్వజారోహణం, అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కలశాలతో ఊరేగింపు చేపట్టారు. పలువురు దంపతులు సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు. మహిళలు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అమ్మవారికి మహా మంగళహారతి అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు విజయ్‌కుమార్, నాగులు, రవి కుమార్, రాజయ్య, కృష్ణయ్య, శ్రీనివాస్, కుమార్, శేఖర్, భీమశంకర్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్ బాలబ్రహ్మేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న దేవతా విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రెండు రోజులుగా వేదమంత్రోచ్ఛారణల మధ్య గణపతి, సుబ్రహ్మణేశ్వర స్వామి, పార్వతీ దేవి, నాగుల విగ్రహాలతో పాటు నవగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలను కనులపండువగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవికుమార్ యాదవ్, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ పాల్గొన్నారు.

బిల్లుల కోసం ఎదురుచూపులు

- పెండింగ్‌లో 'మనఊరు మనబడి' బిల్లులు
- ఆందోళనలో కాంట్రాక్టర్లు
- ప్రభుత్వం వచ్చి 14 నెలలైనా విడుదల కాని నిధులు
- ఖిల్లాఘనపురం మండలంలో 15 పాఠశాలలు



ఖిల్లాఘనపురం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు తరగతి గదులు

ఖిల్లాఘనపురం: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'మనఊరు మనబడి' పథకం ద్వారా చేపట్టిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో విడతల వారీగా పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదటి విడతలో చేపట్టిన పనులకు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో బిల్లులు రాకపోవడంతో పనులు చేసిన వారు ఆందోళనగా ఎదురు చూస్తున్నారు.

15 పాఠశాలలు ఎంపిక..

తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం తీసుకొచ్చిన మనఊరు మనబడి పథకంలో మొదటి విడతలో ఖిల్లాఘనపురం మండలంలో 15 పాఠశాలలను ఎంపిక చేశారు. అందులో మూడు ఉన్నత పాఠశాలలు, రెండు ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో ఇప్పటివరకు మొత్తం 10 పాఠశాలల్లో పనులు పూర్తి చేశారు. మరో 5 పాఠశాలల్లో 80 శాతం పనులు పూర్తి అయినట్లు ఏఈ తెలిపారు.

బిల్లులు రాక ఆందోళన

మండలంలో 15 పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, గోడల మరమ్మతు తదితర పనులు చేసేందుకు ప్రభుత్వం మొత్తం రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. కానీ ఇప్పటివరకు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు రూ.2.21 కోట్ల బిల్లు మాత్రమే అందాయి. మిగతా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక బిల్లులు వస్తాయని 14 నెలలుగా ఎదురు చూస్తున్నారు.



అప్పారెడ్డిపల్లి లో పూర్తయిన డైనింగ్ హాల్

ప్రభుత్వానికి పంపించాం..



మండలంలో మొత్తం 15 పాఠశాలల్లో మనఊరు మనబడి పనులు చేపట్టాం. ఉప్పరిపల్లిలో స్థలం విషయంలో తగాదాలు రావడంతో పనులు చేపట్టలేదు. మిగతా పాఠశాలల్లో పనులు చివరి దశకు వచ్చాయి. ఇప్పటి వరకు మొత్తం రూ.2.21 కోట్ల బిల్లులు వచ్చాయి. మిగతా పనులకు సంబంధించి బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు విడుదల అయిన వెంటనే పనులు చేపట్టిన వారికి ఇవ్వడం జరుగుతుంది.

– సాయిరెడ్డి, విద్యాశాఖ ఏఈ, ఖిల్లాఘనపురం

జాతీయస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



కరాటేలో గ్రాండ్ చాంపియన్ షిప్ సాధించిన సుమను అభినందిస్తున్న మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి

కొత్తకోట రూరల్: నారాయణపేటలో జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన 24వ జాతీయస్థాయి కరాటే ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కొత్తకోటకు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే దూ ఇండియా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బంగారు, వెండి పతకాలు సాధించినట్లు క్లబ్ ఫౌండర్ అబ్దుల్ నబీ తెలిపారు. ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి వెయ్యి మంది విద్యార్థులు హాజరయ్యారు. కొత్తకోటకు ఓవరాల్ గ్రాండ్ చాంపియన్ షిప్ సాధించిన ట్లు నబీ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డిలు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. చాంపియన్ షిప్ సాధించిన మాస్టర్ సుమను వారు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ మాస్టర్స్ జి.హరీష్ యాదవ్, ఇంతియాజ్, ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు



కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఎస్ఐ ఆనంద్, సీనియర్ కరాటే మాస్టర్లు

కొత్తకోట రూరల్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించినట్లు సీనియర్ కరాటే మాస్టర్లు పరశురాం, శివశంకర్, నరేష్‌నాయుడు, రమేష్ తెలిపారు. ఈ పోటీల్లో కొత్తకోట, పాలెం, కనిమెట్ట, గోవిందహళ్లి, మోజర్ల గ్రామాలకు చెందిన దాదాపు 249మంది విద్యార్థులు పాల్గొనగా, ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఎస్ఐ ఆనంద్ విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడం వల్ల విద్యార్థులు దృఢంగా ఉండటంతో పాటు మానసిక, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవచ్చన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు కరాటే నేర్చుకోవడం మంచిదని, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ డాక్టర్ పీజే బాబు, పీ కృష్ణారెడ్డి, ఎన్‌జె బోయేజ్, మేస్త్రీ శ్రీనివాసులు, పెంటన్నయాదవ్, నరేందర్‌రెడ్డి, కరాటే మాస్టర్లు రమేష్ రెడ్డి, సంతోష్, గౌతమ్, మాధవ్ నాయుడు, శివయ్య, యాదగిరి, కురుమూర్తి, అంజి, రాము, అరవిందు, వెంకటేష్ ఉన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

- సీపీఎం రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీ



ఆత్మకూర్‌లో జాన్‌వెస్లీని సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆత్మకూర్: ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని, ప్రజలకు పాలకులు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రలందరు కలిసిరావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఆదివారం సాయంత్రం ఆత్మకూర్‌కు వచ్చిన ఆయనకు సీపీఎం, సీపీఐ, ఎంఆర్‌పీఎస్, ఆవాజ్ కమిటీ, ప్రజా సంఘాల నాయకులు ఘనస్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తనపై నమ్మకంతో సీపీఎంపార్టీ రాష్ట్రకార్యదర్శిగా బాధ్యతను అప్పగించిందని ప్రతినిత్యం బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని, తనను సత్కరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజు, రాబర్ట్, మోష, సీఎస్‌శెట్టి, లక్ష్మణ్, మాసన్న, జానకీరాం, జహంగీర్, దండు శ్రీను, గయాసుద్దీన్, ఖాజాపాష, భట్టిపాష, జూరాల పాష, ఖలీల్, ఉన్నారు.

కొత్తకోటలో ఘన స్వాగతం

కొత్తకోట రూరల్: తెలంగాణ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి కొత్తకోట వివిధ ప్రజా సంఘాలు, సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్, హమాలీ, అంగన్‌వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయతీ కార్మికులు, ఐకే ఆర్పీలు జాన్‌వెస్లీకి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. వివిధ రంగాల కార్మికులు తమ సమస్యలను జాన్‌వెస్లీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, కొత్తకోట సీపీఎం కార్యదర్శి నిక్సన్, కె.వెంకటయ్య, కృపయ్య, కుర్మన్న, వెంకటేష్, నర్సింహులు, అంగన్‌వాడీ టీచర్స్ వెంకటేశ్వరమ్మ, వనజకుమారి, ఐకేపీ ఆర్పీలు లావణ్య, ప్రశాంత, ప్రసన్నకుమారి తదితరులు ఉన్నారు.

కనులపండువగా తెప్పోత్సవం



ధరూరు: మండల పరిధిలోని అల్వలపాడులో తెలుగోనిపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని రెండో రోజైన ఆదివారం సాయంత్రం ఆలయంలో ఉపనయనం, తెప్పోత్సవం, పల్లకీ సేవలు జరిపించారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా వెలుగొందుతున్న స్వామి వారిని జిల్లా పరిసర ప్రాంతాలతో పాటు కర్నాటకకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులకు తాగునీరు, ఇతర ఏర్పాట్లను చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. 17న సాయంత్రం స్వామి వారి రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

వేడుకగా ఆలయ వార్షికోత్సవం

అయిజ: పట్టణ సమీపంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం 5వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా వేదపండితులు ఆలయంలో సుప్రభాత సేవ, స్వస్తిపారాయణం, మూలవిరాట్లకు అభిషేకం, మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన పూజలు నిర్వహించారు. అదే విధంగా సర్వతో భద్ర మండలి పూజ, హోమ ప్రజ్వలన, ధ్వజారోహణం, మహా నైవేద్యం, తీర్థప్రసాద వితరణ, కార్యక్రమాలు జరిపించారు. అనంతరం అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నారాయణపేట రూరల్: మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలని ఎస్ఐ రాయుడు కోరారు. నారాయణపేట మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు డాగ్‌తో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామాల్లోని కిరాణా దుకాణాలు, శివారు ప్రాంతాల్లోని పొలాలు, కొరియర్ సెంటర్లపై నిఘా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కానిస్టేబుల్ శ్యామప్ప, నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ హ్యాండ్లర్ పరమేష్ పాల్గొన్నారు.

ఎంబీ చర్చి ఆవరణలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న సాయి నేత్రాలయ కంటి ఆస్పత్రి వైద్యులు

కొత్తకోట: మున్సిపాలిటీ కేంద్రంలోని 14వ వార్డులో ఎంబీ చర్చి ఆవరణలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీ సాయినేత్రాలయ కంటి ఆస్పత్రి వారు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ ప్రారంభించారు. శిబిరంలో దాదాపు 60మందికి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్లు రామకృష్ణ, శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌జె బోయేజ్, కొమ్ము క్రాంతికుమార్, అయ్యన్న, ఖాజా మైనొద్దీన్, నిక్సన్, సుందర్ రాజు, ఇజ్రాయిల్, ఎంబీ చర్చి పాస్టర్ మెన్నో సైమన్, నవీన్ కుమార్, ప్రవీణ్ కుమార్, శ్రీనివాసులు, శ్రీ సాయి నేత్రాలయ కంటి ఆస్పత్రి సిబ్బంది ఉన్నారు.

శంకుస్థాపనలకే పరిమితం

- తహసీల్దార్, ఏడీఏ కార్యాలయాలు నిర్మాణమయ్యేనా?



తహసీల్దార్, ఏడీఏ కార్యాలయాల శిలఫలకాలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం సమీపంలో నూతన తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయ సంచాలకుల(ఏడీఏ) కార్యాలయాల నిర్మాణానికి గత ప్రభుత్వం 2023 సెప్టెంబర్ 28న శంకుస్థాపన చేసింది. తహసీల్దార్ కార్యాలయం నిర్మాణానికి రూ.1.75 కోట్లు, ఏడీఏ కార్యాలయ నిర్మాణానికి రూ.33.30 లక్షలు కేటాయించింది. ఇప్పటికీ 17 నెలలు కావస్తున్నా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం పాత పోలీస్‌స్టేషన్ భవనంలో, ఏడీఏ కార్యాలయం రైతు వేదికలో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి. ఆయా భవనాల నిర్మాణం ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పీఆర్ ఏఈ విజయ్ కుమార్‌ను వివరణ కోరగా, గతంలో మంజూరైన పనులకు నిధులు ఉన్నాయా? రద్దు చేశారా? అనే విషయాలు జిల్లా అధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే మంచి అవకాశాలు



కేపీఎల్ క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న పలుస శేఖర్‌గౌడ్

కొత్తకోట: యువత క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుదని కొత్తకోట ఆరోగ్య వాకింగ్ క్లబ్ వ్యవస్థాపకులు, విద్యావేత్త పలుస శేఖర్‌గౌడ్ అన్నారు. కొత్తకోటలో మూడు రోజులుగా కొనసాగుతున్న కేపీఎల్ క్రికెట్ పోటీలను ఆదివారం ఆయన టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిలో యువత చాలా వరకు సెల్‌ఫోన్‌లతో కాలం గడిపేస్తున్నట్లు పేర్కొన్నారు. అదే సమయాన్ని యువత క్రీడలకు కేటాయిస్తే శారీరక దృఢత్వంతో పాటు, మానసిన ఉల్లాసం ఉంటుందన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కేపీఎల్ నిర్వాహకులు నవీన్ కుమార్‌రెడ్డి, గుంత శివ, బాలకృష్ణారెడ్డి, రఘు, కార్తిక్, సాయి, సన్నీ, మహేష్, శివశంకర్, తరుణ్, గణేష్, అరుణ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ క్లెయిమ్స్ వెంటనే చెల్లించాలి



భవన నిర్మాణ సంఘం మండల నూతన కమిటీ సభ్యులతో జిల్లా సహాయ కార్యదర్శి రాజు

అమరచింత: భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్ క్లెయిమ్స్ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ప్రగతిశీల భవన నిర్మాణ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో ఆదివారం మండల భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు అనేక సంవత్సరాలుగా పోరాడితే 1996లో కేంద్ర గవర్నమెంట్ దేశంలో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. మన రాష్ట్రంలో సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం కార్మికులు అనేక దఫాలుగా పోరాటం చేయడం వల్ల 2009లో తెలంగాణ రాష్ట్రంలో భవన, ఇతర నిర్మాణ రంగ కార్మిక బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంక్షేమ బోర్డు వచ్చిన తర్వాత కార్మికులకు ఇచ్చే బెనిఫిట్స్ తక్కువగా చెల్లిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు అందాల్సిన క్లెయిమ్స్ అందే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. అనంతరం భవన నిర్మాణ మండల కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షుడిగా జిలానీ, ఉపాధ్యక్షుడిగా శ్రీను, ప్రధాన కార్యదర్శిగా మన్నెం, సహాయ కార్యదర్శిగా మనోహర్, కోశాధికారిగా అంజి, పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

క్రీడా ప్రాంగణాలు నిరుపయోగం



జమ్మాపూర్‌లో అడవిని తలపిస్తున్న క్రీడా ప్రాంగణం

పాన్‌గల్: యువతలో ఉన్న క్రీడా స్ఫూర్తిని వెలికితీసేందుకు వీలుగా మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు నిర్మించింది. గ్రామాల్లో నిర్మించిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడం, కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో ఆటలు ఆడక వెలవెలబోతున్నాయి. గ్రామాల్లో పిల్లలు, యువతకు నేటికీ సరైన మైదానాలు లేక ఆటలకు దూరమవుతున్నారు. క్రీడల పట్ల ఆసక్తి పెంచాలనే లక్ష్యంతో ఏర్పాటు చేయగా ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. కనీస సౌకర్యాలు కల్పించి మార్పులు చేస్తే వేసవి నాటికి యువత, పిల్లలు ఆటలు ఆడేందుకు అనువుగా ఉంటాయని పలువురు వాపోతున్నారు. మండల కేంద్రంతో పాటు 28 గ్రామ పంచాయతీలలో క్రీడా ప్రాంగణాలు బోర్డులకే పరిమితం కావడంతో పిచ్చిమొక్కలు పెరిగి అడవిగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలను ఆడుకునేందుకు అనువుగా మార్చాలని మండల యువత, క్రీడాకారులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాన్‌గల్ ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2003–2004 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని కేఎస్ఆర్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. దాదాపుగా 22 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు బలరాంమూర్తి, ఎండీ. గౌస్, దామోదర్ రెడ్డి, ఉస్సేన్‌రెడ్డి, భద్రసేనయ్య, మధుసూదన్‌రెడ్డి, సుదీర్‌రెడ్డి, వరప్రసాద్, పావని, పూర్వ విద్యార్థులు వేణుయాదవ్; హఫీజ్, రాజు, రవీందర్, రామకృష్ణ, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా తిక్కవీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



తిక్కవీరేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



పొర్లుదు దండాలు పెడుతున్న భక్తులు

అయిజ: పట్టణంలో తిక్కవీరేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. జాతర బ్రహ్మోత్సవలకు సంబంధించిన ఏర్పాట్లను ఆదివారం సీఐ టాటాబాబు, ఎస్ఐ శ్రీనివాసరావు పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కర్నాటకు చెందిన కొందరు భక్తులు ఆలయం చుట్టూ పొర్లుదండాలు పెడుతూ మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు ఆదివారం రాత్రి శాంతి హోమం జరిపించారు. ప్రభోత్సవాన్ని కనులపండువగా వీక్షించారు. చిన్న రథంపై ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. స్వామి నామ స్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.